క్లుప్తంగా

నేడు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం

కోదాడఅర్బన్ : స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఏఐటీయూసీ, సీఎస్‌సీ హెల్త్ క్యాంప్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల శ్రీనివాసరావు తెలిపారు. శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైద్యశిబిరం ఉదయం 7గంటలకు ప్రారంభించనున్నట్లు తెలిపారు.ఈ వైద్యశిబిరంలో వివిధ ప్రాంతాలకు చెందిన భవన నిర్మాణ, కార్మికులు, ఇతర నిర్మాణ కార్మికులు, సంక్షేమ బోర్డులోని సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ క్యాంపులో బీఓసీ కార్డు ఉన్న వారు మాత్రమే దీనికి అర్హులు అవుతారని, కావున కార్మికులు ఈ మంచి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వర్ధాపురం ఉపసర్పంచ్‌పై అవిశ్వాసం పెట్టాలని వినతి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న వార్డు సభ్యులు

మఠంపల్లి : మండలంలోని వర్ధాపురం ఉపసర్పంచ్ బత్తుల శంకరయ్యపై అవిశ్వాసం ప్రకటిస్తూ సర్పంచ్ బచ్చలకూర అఖిలతో పాటు మరో 6మంది, వార్డు సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ తీర్మానం కాపీని హుజూర్‌నగర్ ఆర్డీఓ జగదీశ్‌రెడ్డికి శనివారం అందజేసి మాట్లాడారు. తీర్మానం కాపీని అందజేసిన వారిలో సర్పంచ్ బచ్చలకూర అఖిల, మీసాల చిన్న నర్సయ్య, అమరారపు జయంతి, గౌస్యాబేగం, నాగమణి, కోటయ్య, నాగరాజు పాల్గొన్నారు.

పాఠశాలకు టీవీ బహూకరణ



పెంచికల్ దిన్నె పాఠశాలకు టీవీ బహూకరిస్తున్న దాతలు

నేరేడుచర్ల : మండలం పెంచికల్‌దిన్నలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు రిటైర్డ్ రైల్వే ఉద్యోగి తక్కిలపాటి రవీంద్రనాథ్ ఠాగూర్ తన భార్య తక్కిలపాటి ప్రమీలారాణి జ్ఞాపకార్థంగా రూ. 30 వేల విలువ గల స్మార్ట్ టీవీని శనివారం బహూకరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ అనిల్‌కుమార్, ఉన్నత పాఠాల ప్రధానోపాధ్యాయులు ఎల్. శ్రీనివాస్‌రావు, రామచంద్రయ్య, శ్రీకనకదుర్గ ట్రస్ట్ చైర్మన్ లచ్చయ్య, రిటైర్డ్ ప్రిన్సిపల్ నర్సింహ్మారావు, స్థానిక పెద్దలు రామ్మూర్తి, కోటేశ్వర్‌రావు, భుజంగరావు, వేణు, ఎస్ఎంసీ చైర్మన్ సావిత్రి, ఉపాధ్యాయులు వీర్య, శ్యాంప్రసాద్, అనిత తదితరులున్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లోని గోవిందాపురంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వీసం నరసింహారావు కుటుంబానికి మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ రూ.15వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సింహారావు కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్‌లు కంకణాల పుల్లయ్య తేజావత్ రవి నాయక్, నియోజకవర్గ ఎస్టీసెల్ అధ్యక్షులు సైదులు నాయక్ నాయకులు బెంజిమెన్ కోటమ్మ, పున్నయ్య పాల్గొన్నారు.

ఆదర్శ రైతు వ్యవస్థను పునరుద్ధరించాలని వినతి

కోదాడరూరల్ : ఆదర్శ రైతు వ్యవస్థను పునరుద్ధరించాలని కోరుతూ ప్రజా భవన్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణిలో ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షులు వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షులు అన్నెం పాపిరెడ్డిలు శనివారం వినతిపత్రం అందజేశారు. నాటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి గ్రామాల్లో రైతులకు సలహాలు సూచనలు ఇచ్చేందుకు గ్రామంలో ఆదర్శ రైతు వ్యవస్థను తీసుకొస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం తమను తొలగించిందన్నారు. మేనిఫెస్టోలో చెప్పిన విధంగా తమను తిరిగి తీసుకోవాలని వారు ఆ వినతిపత్రంలో కోరారు.

సమావేశాలు నిర్వహించాలి

ఆత్మకూరు (ఎస్) : పాఠశాలల్లో నిర్వహించే విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రత్యేక సమావేశాలను సమర్థవంతంగా నిర్వహించాలని మండల విద్యాశాఖ అధికారి ధారాసింగ్ అన్నారు. శనివారం నెమ్మికల్, ఆత్మకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన పీటీఎం సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో శ్రీహరి, భాగ్యశ్రీ, నాగభూషణం పాల్గొన్నారు.

నిలిచిన రోడ్ల నిర్మాణ పనులు



నిలిచిపోయిన కొండాపురం రోడ్డు పనులు



అధ్వానంగా ఉన్న సీతారాంపురం- నారాయణపురం రహదారి

- బిల్లులు చెల్లించక మధ్యలో నిలిపివేసిన కొండాపురం రహదారి పనులు
- టెండర్లు కాని నారాయణపురం, ఆర్లెగూడెం లింకురోడ్లు
- త్వరగా పనులు ప్రారంభించాలని కోరుతున్న ఆయా గ్రామాల ప్రజలు

చిలుకూరు : మండలంలోని పలు గ్రామాలను కలిపి లింక్ రోడ్లకు నిధులు మంజూరైనప్పటికీ పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. ప్రధానం మండలంలోని బేతవోలు రోడ్డులో కొండాపురం క్రాస్ రోడ్డు నుంచి కొండాపురం, మాధవగూడెం గ్రామాల మీదుగా మునగాల మండలం ముకుందాపురం వరకు 8 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద రూ.3.50కోట్ల నిధులు మంజురయ్యాయి. ప్రారంభంలో మాత్రం పనులు చకచక అయ్యాయి. అయితే చేసిన పనులకు సక్రమంగా బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ మధ్యలోనే పనులు నిలిపివేసినట్లుగా తెలుస్తుంది. పనులు నిలిపివేసి ఏడాది కావొస్తుంది. ఈ రోడ్డు పూర్తయితే ఆయా గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తొలుగుతాయి. అలాగే హైద్రాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపైకి వెళ్లాలంటే బేతవోలు ప్రాంత ప్రజలకు చాలా సౌకర్యంగా ఉంటుంది.

ప్రారంభం కాని బీటీ రెన్యూవల్ పనులు

మండలంలోని కోదాడ- హుజూర్‌నగర్ రోడ్డులో సీతరాంపురం నుంచి నారాయణపురం వరకు 2.4 కిలోమీటర్ల వరకు బీటీ రెన్యూవల్‌కు రూ.43లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులు మంజూరై టెండర్లు పిలిచి కూడా ఏడాది అవుతోంది. అయినా కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రావడం లేదు. సకాలంలో బిల్లులు రాకపోవడంతో ఎవరూ టెండర్ వేయడం లేదని తెలస్తుంది. దీంతో ఆ రోడ్డు ప్రారంభ దశలో ఆగిపోయింది. అలాగే మునగాల మండలం నరసింహాపురం నుండి ఆర్లెగూడెం వరకు బీటీ రోడ్డు ఆధ్వానంగా ఉంది. దీంతో బీటీ రెన్యూవల్‌కు రూ.32లక్షలు మంజూరయ్యాయి. కానీ ఇంకా పనులు మొదలు పెట్టలేదు. ఈరోడ్లు పూర్తయితే మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే లింక్ రోడ్డు సమస్యలు పరిష్కారమవుతాయి.

వాహనాలు దెబ్బతింటున్నాయి



సీతారాంపురం మీదుగా నారాయణపురం బీటీ రోడ్డు రెన్యూవల్‌కు నిధులు మంజూరయ్యాయి. కానీ నేటి వరకు పనులు మాత్రం ప్రారంభం కాలేదు. రోడ్డు మొత్తం గుంతలు ఏర్పడి ఆధ్వానంగా తయారైంది. ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే తీవ్ర ఇబ్బందిగా ఉంది. వాహనాలు కూడా దెబ్బతింటున్నాయి. తక్షణమే పనులు ప్రారంభించి పూర్తి చేయాలి.

– మండవ మధు, నారాయణపురం

త్వరలో పనులు ప్రారంభం

కొండాపురం రోడ్డు త్వరలో తిరిగి పనులు ప్రారంభిస్తాం. కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో సీతారాంపురం, ఆర్లెగూడెం బీటీ రెన్యూవల్ పనులు నిలిచిపోయాయి. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పనులు త్వరగా ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటా

– ఏఈ లక్ష్మిరెడ్డి

సైబర్ నేరాల దర్యాప్తుపై అవగాహన



పోలీస్ అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

కోదాడరూరల్ : సైబర్ నేరాల దర్యాప్తులో పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని జిల్లా సైబర్ సెక్యూరిటీ డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. శనివారం పట్టణంలోని ఒక ఫంక్షన్‌హాల్‌లో సైబర్ నేరాల మోసాలపై కేసు నమోదు, దర్యాప్తు అంశాలపై డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులు, సిబ్బందికి అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో పెరుగుతున్న సాంకేతికతతో పాటు సైబర్ మోసాలు కూడా ఎక్కువయ్యాయన్నారు. ఈ విధమైన మోసాలు జరిగినపుడు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీడర్, ముఖ్య ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని సూచించారు. కేసులు నమోదు చేసి దర్యాప్తు చేయాలని సూచించారు. రాష్ట్ర పోలీసు సైబర్ సెక్యూరిటీ విభాగం అత్యంత పటిష్టమైన సాంకేతికతను అందించిందని, ఎస్పీ ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయంలో సైబర్ సెల్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా సైబర్ మోసాల నివారణకు యువత, విద్యార్థులకు అవగాహన కలిగించాలన్నారు. ఈ సమావేశంలో సీఐలు రామకృష్ణారెడ్డి, రామలింగారెడ్డి, రాము, రాఘవలు, రవి, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి ధనుర్మాస ఉత్సవాలు



నేరేడుచర్లలో ఉత్సవాలకు ముస్తాబైన శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం

నేరేడుచర్ల : శ్రీదేవీ భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఈనెల 17 నుంచి జనవరి 14వ తేదీ వరకు ధనుర్మాస ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆలయ ప్రధాన పూజారి ఇరవంటి శ్రీనివాసశాస్త్రీ ఆధ్వర్యంలో వేదమంత్రోత్సవాల నడుము ఉత్సవాలను ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్నారు. ఈనెల 18న సుబ్రమణ్యస్వామి కల్యాణ మహోత్సం, 22న ప్రత్యేక అభిషేకాలు, సాయంత్రం గాజుల పూజ, 23న ముక్కోటి ఏకాదశి ఉత్తర ద్వారా దర్శనం, 29న పుష్పాలంకరణ తామర పూలతో పూజలు, జనవరి 1న కుడార్త్తె ఉత్సవం, 108 గంగాళములతో పాయాసాన్ని నివేదన, జనవరి 14న గోదాదేవి రంగనాథుల దివ్య కల్లా కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేదుకు సిద్ధం చేశారు. ఈ ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ నిర్వాహకులు పేర్కొన్నారు.

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లోని శ్రీ వేణుగోపాల సీతారామచంద్ర స్వామి ఆలయం, శ్రీ జ్ఞానసరస్వతి దేవాలయంలో ఆదివారం నుండి ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం అవుతాయని ఈఓ కొండారెడ్డి, చైర్మన్ లక్ష్మి శనివారం వేర్వేరు ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆలయాల్లో గోపూజ, విష్ణు, గోదా, రామానుజ అష్టోత్తరాలు, తిరుప్పావై సేవా కాలం, మంగళ నీరాజన మంత్ర పుష్పం అనంతరం తీర్థప్రసాదాల గోష్టి నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం పల్లకి సేవ, తిరుప్పావై, ప్రవచనం ఉంటుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు, మహిళలు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొనాలని సూచించారు.

గరిడేపల్లి : మండల పరిధిలోని పోనుగోడు గ్రామంలోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి దేవాలయంలో నేటి నుంచి జనవరి 14వ తేదీ వరకు ధనుర్మాస ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ పేర్కొంది. ప్రతి రోజూ ఉదయం 4గంటలకు సుప్రభాతం ఆరాధన తదుపరి కలశస్థాపన, పుణ్యావచనం, కంకణధారణ, అష్టోత్తర శత నామావళితో కుంకుమార్చన దనుర్మాస పాశుర పఠనం, ఆరగింపు, మంగళాశాసనం, తీర్థ ప్రసాద వినియోగాలు ఆ తదుపరి దేవాలయ ఆవరణలో పల్లకి సేవ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల రోజులు కూడా నిత్య గోత్రనామార్చనలతో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నడిగూడెం : మండల పరిధిలోని సిరిపురం శ్రీ కోదండరామస్వామి దేవాలయంలో ఈ నెల 17నుండి వచ్చే ఏడాది జనవరి 14వరకు ధనుర్మాస వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు వేదాంతం చక్రధరాచార్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గోదాదేవి ప్రత్యేక పూజ కార్యక్రమాలను నెల రోజుల పాటు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు. ఆలయ ధర్మకర్త కీసర వినయ్‌వర్ధన్‌రెడ్డి సహకారంతో ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టాలని నోటీసు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ చందమల్ల జయబాబుపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు కౌన్సిలర్లు సిద్ధమయ్యారు. ఈ మేరకు శనివారం అవిశ్వాస తీర్మాన ప్రతిని (నోటీస్) సూర్యాపేటలోని కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట్రావుకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పది మంది కౌన్సిలర్ల సంతకాలు ఉన్న అవిశ్వాస తీర్మానం ప్రతిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తీర్మాన ప్రతిని మున్సిపల్ కమిషనర్ మరోసారి పరిశీలించాలని, అలాగే మున్సిపల్ చట్టంలోని నిబంధనల మేరకు తదుపరి చర్యలు తీసుకోవాలని హుజూర్‌నగర్ రెవెన్యూ డివిజనల్ అధికారిని ఆదేశించారు. తీర్మాన ప్రతిని అందించిన వారిలో కౌన్సిలర్లు కె.వెంకట్‌రెడ్డి, బి.జితేందర్‌రెడ్డి, బి.ప్రకాష్, ఆర్.నాగయ్య, వి.నాగమణి, ఎస్.సుగుణ, ఏ.సరిత, కె.సరిత, కె.సులోచన, బి.లలిత తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ కౌన్సిలర్లు చేరిక



మంత్రి ఉత్తమ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఇద్దరు మున్సిపల్ కౌన్సిలర్లు శనివారం హైదరాబాద్‌లో కాంగ్రెస్‌లో చేరారు. ఆ పార్టీ నాయకుడు గెల్లిరవి ఆధ్వర్యంలో రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సమక్షంలో కౌన్సిలర్లు జక్కుల శంబయ్య, ఓరుగంటి నాగేశ్వర్‌రావులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి మంత్రి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సతీష్, పిన్నాని సంపత్, గంజి శివ తదితరులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యను బోధించాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఇస్కాన్ ప్రచారక్‌లు

కోదాడరూరల్ : విద్యార్థులకు నైతిక విలువతో కూడిన విద్యను బోధించాలని బెంగుళూరుకు చెందిన ఇస్కాన్ ప్రచారక్‌లు నవీన్‌కుమార్, సమీర్‌లు అన్నారు. శనివారం పట్టణ పరిధిలోని కొమరబండలోని తేజ విద్యాలయ పాఠశాలలో 'జీవన నైపుణ్యాల మెరుగులో నైతిక విలువల పాత్ర' అనే అంశంపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో వారు మాట్లాడారు. విద్యార్థులు జీవన నైపుణ్యాలను పెంచుకోవాలని తరగతి గదిలో సత్ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు. ఉపాధ్యాయులు చదువుతో పాటు మానవ సంబంధాలు, సమాజంలో వస్తున్న మార్పులపై ఎప్పటికపుడు అవగాహన కలిగించాలన్నారు. ఈ సందర్భంగా ఇటీవల రాష్ట్ర, జాతీయ స్థాయిలో వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులను అభినందించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పోతుగంటి నాగేశ్వర రావు, వేణుగోపాలరావు ఉన్నారు.

అయ్యప్ప మాలధారులకు అన్నదానం



కోదాడ రూరల్ : అన్నదానంలో పాల్గొన్న జెడ్పీటీసీ శిరీషానాగేంద్రబాబు

కోదాడరూరల్ : హుజూర్‌నగర్ రోడ్డులోని గాలి రమేశ్‌నాయుడు అయప్ప సన్నిధానంలో మాలధారులకు అన్నదాన కార్యక్రమాన్ని చిలుకూరు జెడ్పీటీసీ బొలిశెట్టి నాగేంద్రబాబు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ అన్నదానం ఎంతో గొప్పదన్నారు. ఈ అన్నదాన కార్యక్రమంలో 550మంది మాలధారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు అక్కమ్మ, ప్రవల్లి, శ్రీవల్లి, శ్రీనివాసునాయుడు, సూర్యారెడ్డి, సీతరాంసింగ్, రంగా, పాల్గొన్నారు.

కోదాడఅర్బన్ : పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో మాలధారులకు దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు రేపాల ప్రసాదరావు, చల్లా రామ్మూర్తిలు తెలిపారు. పట్టణానికి చెందిన కాటేపల్లి వెంకయ్య జ్ఞాపకార్థం ఆయన భార్య రాజ్యం, కుమారుడు సూర్యానారాయణ, పద్మాతి వారి కుటుంబ సభ్యులు ఈ అన్నదాన కార్యక్రమానికి సహకరించనట్లు తెలిపారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువా, జ్ఞాపికతో సత్కరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి రామనాథం, ఇరత గురుస్వాములు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత బీఆర్ఎస్‌కు లేదు

మునగాల : నూతనంగా ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత బీఆర్ఎస్ పార్టీకి లేదని మండలంలోని రేపాల ఎంపీటీసీ సభ్యుడు సొంపంగు మోహన్ ఎద్దేవా చేశారు. శనివారం ఆయన మునగాలలో విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి పట్టుమని పదిరోజులు కూడా కాకముందే బీఆర్ఎస్ నాయకులు తమ ఇష్టమొచ్చిన రీతిగా మాట్లాడడం సబబు కాదన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి మిగులు బడ్జెట్‌గా ఉన్న రాష్ట్రాన్ని దివాలా తీయించడమేగాక ఎమ్మెల్యేలు, ఎంపీలు దోచుకొని దాచుకొని ప్రజలను ఏ మాత్రం పట్టించుకోలేదని ఆరోపించారు. రాష్ట్ర ప్రజలు ఇచ్చిన తీర్పును జీర్ణించుకోలేని బీఆర్ఎస్ నాయకులకు వచ్చే లోకల్‌బాడీ ఎన్నికల్లో తగిన విధంగా గుణపాఠం చెబుతారన్నారు. ఇప్పటికైన బీఆర్ఎస్ నాయకులు బుద్ధి తెచ్చుకొని మంచి ప్రవర్తనతో ప్రతిపక్ష పాత్ర పోషించాలని హితవు పలికారు.

ఆహారపు అలవాట్లపై అవగాహన పెంచుకోవాలి



చిరుధాన్యాలపై అవగాహన కల్పిస్తున్న సిరి ఫౌండేషన్ చైర్మన్ గోపి

కోదాడరూరల్ : ప్రతి ఒక్కరూ ఆహారపు అలవాట్లపై అవగాహన పెంచుకోవాలని సిరి ఫౌండేషన్ చైర్మన్ మొలుగూరి గోపి అన్నారు. శనివారం మండల పరిధిలోని చిమిర్యాలలో సిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిరుధాన్యాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. చిరుధాన్యాలను ప్రతిరోజూ ఆహారంగా తీసుకోవడం ద్వారా దీర్ఘకాలిక వ్యాధుల నుంచి క్రమంగా దూరంగా కావొచ్చని ప్రజలకు సూచించారు. ప్రతి ఒక్కరూ తమకున్న భూమిలో కొంత మేర చిరుధాన్యాలైన రాగులు, కొర్రలు, అండుకొర్రలు, అరికలు, సామలు, జొన్న, సజ్జ వంటి పంటలు సాగుచేసుకోవాలని కోరారు. సాగు యాజమాన్యపద్ధతులను వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొండా శైలజ, రైతులు శ్రీనివాసరావు, రామానాథం, సతీష్, శివారెడ్డి, లియాఖత్, వెంకటరమణ, కాశమ్మ, కేశవయ్య, నాగుల్‌మీరా ఉన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



హాస్టల్ భవనాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ, జిల్లా అధికారి

హుజూర్‌నగర్ : ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం రాత్రి హుజూర్‌నగర్‌లోని బీసీ బాలుర హాస్టల్‌ను ఆయన ఆకస్మికంగా తనఖీ చేశారు. ఈసందర్భంగా హాస్టల్ భవనాన్ని పరిశీలించి విద్యార్థులకు అన్ని సౌకర్యాలు అందుతున్నాయా లేదా అని ఆయన తెలుసుకుని మాట్లాడారు హాస్టల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతులు అభివృద్ధి అధికారి వై. మాధవరెడ్డి, సహాయ అధికారి ఎస్తేర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లోని వివిధ వార్డుల్లో ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఎంపీ నిధులు రూ 95లక్షలతో సీసీ రోడ్డు పనులు చేయనున్నట్లు కౌన్సిలర్ కోతి సంపత్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని మూడో వార్డులో ఎన్నికల ముందు రూ. 20 లక్షలతో ప్రారంభించిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ప్రస్తుతం రూ. 20 లక్షలతో 340 మీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను పునరుద్ధరించాలి



మంత్రి ఉత్తమ్‌కు వినతిపత్రం అందజేస్తున్న పూర్వఉద్యోగులు

హుజూర్‌నగర్ : గత ప్రభుత్వంలో పనిచేసిన హౌసింగ్ బోర్డు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం పునరుద్ధరించాలని పూర్వ ఉద్యోగుల యూనియన్ నాయకులు శనివారం రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో పనిచేసిన తమను బీఆర్ఎస్ ప్రభుత్వం తొలగించిందన్నారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పునరుద్ధరించి తమను ఆదుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో యూనియన్ నాయకులు మహమ్మద్ ఖలీద్, గంజి శివ, బానోతు వెంకటేశ్వర్లు, బండారు మురళి, షేక్ రఫీ, గోలి శంబయ్య పాల్గొన్నారు.

అమరవరం లిఫ్ట్ మరమ్మతులు షురూ

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని అమరవరం లిఫ్ట్ ఎత్తిపోతల పైపులైన్‌కు శనివారం ఆయా గ్రామాల రైతులు కాంట్రాక్టర్‌తో కలిసి బుంగలకు మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ ఉస్తేల గురువారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు మరమ్మత్తు పనులు చేయించి లిఫ్ట్‌ను రైతులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం ఆమా గ్రామాల రైతులు, కాంట్రాక్టర్ తదితరులు ఉన్నారు.

పాఠశాల అభివృద్ధికి కృషిచేయాలి

నడిగూడెం : పాఠశాల అభివృద్ధికి కృషిచేయాలని మండల విద్యాధికారి ఎం.సలీం షరీఫ్ కోరారు. శనివారం మండల కేంద్రంలోని కాలనీ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ప్రతి ఒక్కరూ బాధ్యతతో పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో పాఠశాల హెచ్ఎం మల్లయ్య, సీర్పీలు గురుస్వామి, నాగార్జున, పాల్గొన్నారు.

బాప్టిస్ట్ చర్చిలో స్త్రీల మైత్రి క్రిస్మస్ ఆరాధన



కేక్ కట్ చేస్తున్న క్రైస్తవ మహిళలు

కోదాడఅర్బన్ : పట్టణంలోని నయానగర్‌లో ఉన్న బాప్టిస్ట్ చర్చిలో స్త్రీల మైత్రి క్రిస్మస్ ఆరాధన కార్యక్రమాన్ని శనివారం చర్చి పాస్టర్ రెవరెండ్ డాక్టర్ వి యేసయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు కేక్ కట్ చేసి క్రీస్తును ఆరాధిస్తూ కీర్తనలు ఆలపించారు. ఈ వేడుకల్లో చిన్న పిల్లల నృత్యాలు ఆలరించాయి. ఈ కార్యక్రమంలో సుమలత, మున్సిపల్ క్రిస్టియన్ మైనార్టీ కోఆప్షన్ సభ్యురాలు వంటిపాక జానకీ ఏసయ్య, భాగ్యశ్రీ మౌనిక, మెరీనారాణి, జ్యోతి, నాగేశ్రరావు, సీత, సువార్త, సలోమి, లూదియా కృష్ణవేణి, సరిత, కార్తీయ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

నర్సయ్య మృతి కాంగ్రెస్‌కు తీరనిలోటు



నర్సయ్య చిత్ర పటం ఎదుట నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మునగాల : మండలంలోని నర్సింహులగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నరంశెట్టి నర్సయ్య మృతి పార్టీకి తీరనిలోటని ఆ పార్టీ నాయకుడు బుచ్చిపాపయ్య అన్నారు. ఇటీవల గుండెపోటులో మృతిచెందిన నర్సయ్య దశదినకర్మ సందర్భంగా శనివారం నర్సింహులగూడెంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళలర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి నరేందర్‌రెడ్డి, నాయకులు జైపాల్‌రెడ్డి, వహీద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్యశిబిరం

భానుపురి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సూర్యాపేట కార్యాలయంలో ఈ నెల 18వ తేదీన వరంగల్‌కు చెందిన మ్యాక్సివిజన్ లేజర్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు దండ శ్యాంసుందర్ రెడ్డి, సుధగాని నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించే వైద్యపరీక్షలకు పెన్షనర్లు తమ హెల్త్ కార్డును తీసుకొని రావాలని కోరారు.

ఘనంగా గోవిందమాల మహామండల పూజ

భానుపురి : పట్టణంలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో గోవింద మాల భక్తబృందం ఆధ్వర్యంలో శనివారం మహామండల పూజ, సహస్ర కలశాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో శ్రీ శ్రీ త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి ప్రత్యక్షంగా సహస్ర కలశాభిషేకాన్ని నిర్వహించారు. వేయి కలశాలతో అనేక నదీ జలాలు, సముద్ర జలాలు, సుగంధ ద్రవ్యాలు, పంచామృతాలు, పండ్ల రసాలు, కొబ్బరి జలాలతో ఘనంగా మహా మండల పూజ ముగిసింది. అనంతరం శ్రీఅహోబిల జీయర్ స్వామి మాట్లాడారు. భానుపురి పట్టణ భక్తులు గోవింద మాల దీక్ష ధారణ చేయడమే కాకుండా సహస్ర కలశ అభిషేకం నిర్వహించడం చాలా గొప్ప విషయమన్నారు. ప్రతి ఒక్కరూ రామాయణం చదవాలని, తద్వారా ఉన్నత జీవితాన్ని పొందగలుగుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాంచరాత్ర ఆగమ పండితులు రఘు దత్తు ఆచార్యులు, నల్లాన్ చక్రవర్తుల హరిచరణ్ ఆచార్యులు, వంశీకృష్ణమాచార్యులు, సంకర్షణ ఆచార్యులు, శ్రీహరి ఆచార్యులు, గోవిందమాల భక్తులు శ్రీనివాస్, నాగరాజు, రమేష్, బూర నాగరాజు, దంతాల చంద్రశేఖర్, వెంకటాచారి, పట్టణ ప్రముఖులు, వికాస తరంగిణి ఆండాళ్ గోష్టి భక్త బృందం తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నా కరపత్రాల ఆవిష్కరణ

భానుపురి : ఎస్సీ వర్గీకరణ లక్ష్యంగా ఢిల్లీలోని జంతర్ మంతర్‌లో ఈ నెల 21వ తేదీన నిర్వహించే చలో ఢిల్లీ మహాధర్నాను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ సూర్యాపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాలడుగు పరశురాం మాదిగ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పబ్లిక్ క్లబ్‌లో చలో ఢిల్లీ మహాధర్నా కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ టీఎస్ పట్టణ అధ్యక్షుడు ఏర్పుల సాయి మాదిగ, పిడమర్తి సునీత మాదిగ, దైద ఉపేందర్ మాదిగ, నాగయ్య, దుబ్బ రమేష్ మాదిగ పాల్గొన్నారు.